

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- గతంలో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్న జూపల్లి
- కృష్ణారావు మాటలకు భిన్నంగా సాగుతున్న దందా
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బరితెగించిన ఇసుకాసురులు
- నేడు నిజామాబాద్‌కు రానున్న ఇన్‌చార్జి మంత్రి
- ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేనా?

# జూపల్లి అయినా ఆపేనా?



### ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా సహజ వనరుల దోపిడీ

నిజామాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఇసుక అక్రమార్కులు బరి తెగించారు. అడ్డూ అదుపు లేకుండా ఏడాది కాలంగా సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ పెద్దలెవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రజాపాలనలో దోపిడీకి చరమ గీతం పాడుతామని ఘనంగా ప్రకటనలు చేసినప్పటికీ అవేవి ఆచరణలో కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావును నియమితులయ్యారు. ఏడాది కాలంగా ఈ ప్రాంతానికి మంత్రి లేకపోవడంతో ఇన్‌చార్జి మంత్రి ఒక్కరే అన్నింటికీ పెద్ద దిక్కుగా కొనసాగుతున్నారు. ఇందులో భాగంగా తన తొలి పర్యటనలో మంజీరా పరివాహక ప్రాంతాల్లో జూపల్లి పర్యటించారు. ఇసుక అక్రమాలను చూస్తూ ఊరుకోబోమంటూ ఘనంగా ప్రకటించారు. గతంలో దోపిడీ జరిగిందంటూ వ్యాఖ్యానాలు చేస్తూనే, భవిష్యత్తులో ప్రజలకు ఉపయుక్తమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. సీన్ కట్ చేస్తే ఇప్పుడంతటా ఇసుక అక్రమ వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లు అన్నట్లుగా నడుస్తున్నది. వాగులు, వంకలు, నదులు ఇలా ఏదీ తేడా లేకుండా ఇసుకను కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలతో ఇసుకాసురులు కొల్లగొడుతున్నారు. కట్టడి చేయాల్సిన యంత్రాంగం చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతున్నది. నిజామాబాద్ జిల్లా పర్యటనకు ఆదివారం వస్తున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు.. భూగర్భ వనరుల దోపిడీని అరికట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు వేడుకుంటున్నారు.

### వాగులు గుల్లా..

మంజీరా నదితోపాటు వాగులను సైతం కాంగ్రెస్ నేతలు కొల్లగొడుతున్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో కప్పల వాగు, పెద్ద వాగులో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. జాతీయ రహదారి మీదుగానే వందల ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆయన గతంలో ప్రాతినిధ్యం వహించిన బాల్కొండ నియోజకవర్గంలోనే ఇసుక వ్యాపారం జోరుగా సాగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యారు. టీజీఎండీసీ చైర్మన్ హోదాలో అనిల్ ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సర్కారు ఆధీనంలో ఇసుక వ్యాపారం అధికారికంగా నిర్వహిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని గుర్తు చేస్తున్నారు. అలాంటి ఆలోచనలకు బీజం వేయాలని కాంగ్రెస్ పార్టీలోని మరో వర్గం సైతం విన్నవిస్తున్నది. ఇలాంటి దోపిడీ వల్ల ప్రజల్లోనూ పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని ఆ పార్టీ శ్రేణులే ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బోధన్ నియోజకవర్గంలోనూ ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా నడుస్తున్నది. గోదావరి నదికి వరదను మోసుకొచ్చే వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుక కొల్లగొడుతున్నారు. మంజీరా పరీవాహకంలో జరుగుతున్న దోపిడీకి దీటుగా వాగుల్లోనూ ఇసుక తరలింపు నడుస్తున్నది. నిజామాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి జూపల్లి ఇసుక అక్రమ దందాపై సమీక్ష చేసి సహజ సంపద దోపిడీని అరికట్టి, సర్కారుకు వచ్చే ఆదాయ మార్గాలను కాపాడాలని ఉమ్మడి జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



### అంతా జీరో దందానే..

బీఆర్ఎస్ హయాంలో ఇసుక దోపిడీ జరిగిందంటూ గతంలో కాంగ్రెస్ పెద్దలు వ్యాఖ్యానించారు. కానీ ఆ సమయంలో అధికారికంగా టీజీఎండీసీ ద్వారా క్వారీలను నిర్వహించారు. క్వారీల్లో ప్రతి లోడ్‌కు నిర్ణీత రుసుమును సర్కారుకు చెల్లించారు. నిరంతర తనిఖీలతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నాటి ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. కానీ ఇప్పుడు క్వారీలు మూసేశారు. మంజీరాలో కొత్తగా ఎలాంటి అనుమతులను ఇవ్వడం లేదు. అధికారికంగా అనుమతులు లేకున్నప్పటికీ ఇసుక తవ్వకాలు ఆగలేదు. ఏడాది కాలంగా అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతున్నది. మంజీరా నదిలో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. నదీ గర్భం నుంచి ఇసుకను తోడుతున్న అక్రమార్కులు ప్రభుత్వానికి పైసా కట్టడం లేదు. ఫలితంగా సర్కారు ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదు. గత సర్కారుపై లేనిపోని ఆరోపణలు చేసిన వారు ఇప్పుడు కండ్ల ముందరే జీరో దందా నడుస్తున్నప్పటికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతుండడంతో యంత్రాంగం చేష్టలూడిగి చూస్తున్నది. గతంలో అధికారికంగా క్వారీలు నిర్వహించినప్పుడు స్థానిక గ్రామ పంచాయతీలకు సైతం అందులో నుంచి వాటాగా నిధులు సమకూరేవి. కానీ ఇప్పుడు అక్రమార్కుల దోపిడీతో గ్రామాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. మొత్తం సొమ్మంతా కాంగ్రెస్ అనుచరుల జేబుల్లోకే వెళ్తుండడం విశేషం.

# సర్వే సక్రమంగా చేయండి

### అధికారులను నిలదీసిన సులేమాన్‌నగర్ వాసులు




రేషన్‌కార్డుల సర్వే తీరుపై పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

రుద్రూర్, జనవరి 18: రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్న తీరుపై ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితో అర్హులకు కాకుండా అనర్హులకు ప్రభుత్వ పథకాలు దక్కేలా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే సర్వేకు వస్తున్న అధికారులపై స్థానికులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్‌లో రేషన్ కార్డుల సర్వేపై గ్రామస్తులు శనివారం అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా నిర్వహించడం లేదని కార్యదర్శిని నిలదీశారు. ఎన్నో ఏండ్లుగా గ్రామంలో నివాసముంటున్న తమ పేర్లు జాబితాలో లేవని, కానీ మహారాష్ట్ర నుంచి ఇటీవల వచ్చి నివాసముంటున్న పేర్లు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని, స్వగ్రామంలో ఉంటున్న వారికే కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌లో దుమారం

- మార్క్‌ఫెడ్ చైర్మన్ అవినీతిపై రైతు పోరాటం
- సొసైటీ లెక్కలు చెప్పడం లేదని సొంత పార్టీ నేత దీక్ష
- చర్చనీయాంశంగా మారిన అంకాపూర్ వ్యవహారం



మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అవినీతికి వ్యతిరేకంగా అంకాపూర్‌లో నిరాహార దీక్ష చేపట్టిన వినోద్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, జనవరి18: కాంగ్రెస్ పార్టీలో దు'మార'ం రేగింది. మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అవినీతికి వ్యతిరేకంగా సొంత పార్టీ నాయకుడే దీక్షకు దిగడం జిల్లాలో చర్చనీయాంశమైంది. అంకాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మార గంగారెడ్డి మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా ఉన్న సంగతి తెలిసిందే. అయితే, సొసైటీ లెక్కలు చెప్పడం లేదని, అంతులేని అవినీతికి పాల్పడ్డారని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన రైతు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వినోద్‌రెడ్డి శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడి అవినీతికి వ్యతిరేకంగా అదే పార్టీ నేత దీక్ష చేపట్టడం రాజకీయంగా దు'మారం' రేపింది. అంకాపూర్ సొసైటీకి సంబంధించిన లెక్కలను చూపాలని వినోద్‌రెడ్డి కొన్నాళ్లుగా అడుతున్నారు. గోదాం అమ్మిన డబ్బులతో పాటు విరాళంగా వచ్చిన నిధులను ఏం చేశారని పలుమార్లు ప్రశ్నించినా సరైన స్పందన రాలేదు. ఈ క్రమంలోనే వినోద్‌రెడ్డి శనివారం గ్రామంలో దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకాపూర్‌లోని సొసైటీకి చెందిన గోదాం అమ్మిన డబ్బులు రూ.25 లక్షలు, విరాళంగా వచ్చిన రూ.5 లక్షలకు సంబంధించిన లెక్కలు చూపించడం లేదన్నారు. రూ.30 లక్షలకు సంబంధించిన లెక్కలు చూపించాలని గత నెలలో పీఏసీఎస్ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన సొసైటీ చైర్మన్ మార గంగారెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీకి ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ క్రమంలో వీడీసీ సభ్యులు తనకు జరిమానా విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో గంగారెడ్డి వచ్చే నెలలో లెక్కలు చూపుతామని వీడీసీకి హామీ ఇవ్వడంతో తాను రాజీ పడ్డానని తెలిపారు. నెల రోజులు గడుస్తున్నా లెక్కలు చూపించకపోవడంతో పోరాటం చేయక తప్పడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లోనే రిలే నిరాహార దీక్ష చేపట్టానని వినోద్‌రెడ్డి చెప్పారు. గ్రామం కోసం చేస్తున్న ఆయన ఆందోళనకు పరోక్షంగా మద్దతునిస్తున్న గ్రామస్తులు వీడీసీకి భయపడి ముందుకు రావడం లేదని తెలిసింది.

# 'ప్రజావాణి' తాత్కాలికంగా వాయిదా

కంఠేశ్వర్, జనవరి 18: ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వచ్చే సోమవారం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఈ నెల 20న సోమవారం జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 27 నుంచి యధావిధిగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



సంగీత కచేరీలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జగన్ తదితరులు

# సంగీతంతో మానసిక ప్రశాంతత

సుభాష్‌నగర్, జనవరి 18: సంగీతం మనస్సుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తుందని, తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో స్వరసౌరభం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాజిరెడ్డి మాట్లాడుతూ.. అలనాటి పాటల్లో సాహిత్యం, సంగీతం చాలా బాగుండేదన్నారు. శాస్త్రీయ సంగీతానికి నాదబ్రహ్మ, త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు జరుగుతున్న ఈ శుభవేళ సంగీత విభావరి నిర్వహిస్తున్న కళా సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా సముద్రాల రాములు, అన్నపూర్ణ, ఆయాచితం నాగరాజు శర్మ తదితరులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ప్రతినిధులు శిరీష రాఘవేందర్, రాజ్‌కుమార్ సుబేదార్, చందన్‌రావు, పాయల్ కోటగిరకర్, గణపతి అశోకశర్మ తదితరులు పాల్గొన్నారు.



### తెల్లారినా తొలగని తెలిమంచు

నాగిరెడ్డిపేట మండలాన్ని పొగమంచు కమ్మేసింది. శనివారం ఉదయం నుంచి పల్లెలన్నీ తెలిమంచు గుప్పిట్లోనే ఉన్నాయి. పది గంటలు దాకా అదే పరిస్థితి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొలాలకు వెళ్లే రైతులు, పని మీద బయటికి వచ్చే ప్రజలు చల్లని గాలులతో వణికిపోయారు.
– నాగిరెడ్డిపేట, జనవరి 18



పెద్ద కొడప్‌గల్‌లో మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పిల్లలు

### పిల్లలు చొరవ.. శుభ్రమైన కాలువ

గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం.. సిబ్బంది అలక్ష్యంతో పెద్దకొడప్‌గల్‌లోని మురికి కాలువలు పేరుకుపోయాయి. చెత్తాచెదారం నిండడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. జీపీలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దుర్వాసన భరించలేక పిల్లలు నడం బిగించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చేశారు.
– పెద్ద కొడప్‌గల్, జనవరి 18

# వేతనాలు ఇవ్వాలని కలెక్టరేట్ ముట్టడి




కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కామారెడ్డి, జనవరి 18: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి దవాఖానల్లో పని చేసే కార్మికులకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని వారు వాపోయారు. శానిటేషన్ పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు, ఇతర కార్మికులు పని భారంతో పాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఇంటి కిరాయి చెల్లించలేక, నిత్యావసర వస్తువులు కొనలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏవో సహిద్ అహ్మద్ మసూర్‌కు వినతిపత్రం అందజేశారు. మెడికల్ ఎంపాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథ్, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రేణుక, గంగారాం, కాశీరావు, సురేఖ, సాయిబాబా, కల్యాణి, సంగీత, శారద, పోశవ్వ, మహేందర్, సాయిలు, సాయిబాబా పాల్గొన్నారు.

### లీలా రామన్ కన్నుమూత



లీలా రామన్ (ఫైల్)

కామారెడ్డి, జనవరి 18: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు, నిజామాబాద్ జిల్లా పూర్వ కలెక్టర్ బీఎన్ రామన్ సతీమణి లీలా రామన్ (94) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఆలిండియా రేడియోలో ఇంగ్లిష్ న్యూస్ రీడర్‌గా పని చేసిన ఆమె.. బీఎన్ రామన్‌తో వివాహం అనంతరం ఉద్యోగం వదిలి భర్త కార్యాచరణలో చేదోడు వాదోడుగా నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన బీఎన్ రామన్ హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతూ రెండేండ్ల క్రితం కన్నుమూశారు. భర్త మరణానంతరం లీలా రామన్ అమెరికాలో స్థిరపడిన తన కొడుకు వద్దే ఉంటున్నారు. ఆమె మృతిపై డిగ్రీ కళాశాల యాజమాన్యం శనివారం తీవ్ర సంతాపం ప్రకటించింది.

### పాఠశాల భవనం నిర్మించాలని ధర్నా



పాఠశాల భవనం నిర్మించాలని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న స్థానికులు

పోతంగల్, జనవరి 18: పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ పోతంగల్ బస్టాండ్ వద్ద స్థానికులు శనివారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని మౌలగల్లి జామ మసీద్ దగ్గర ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల భవనం శిథిలావస్థనకు చేరడంతో కూల్చేశారని, ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదని వాపోయారు. 120 మంది విద్యార్థులు ఉన్నారని, గదులు సరిపోక పక్కన ఉన్న ముస్లిం మత ఆశ్రమంలో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. స్థానికులు హన్మాండ్లు, షేక్ నయీమ్, గౌస్, పబ్బ శేఖర్, ఫారుక్, ఇస్మాయిల్, ముజీబ్, లయక్ తదితరులు పాల్గొన్నారు.